క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

రుద్రవరం: మండలంలోని తువ్వపల్లె తిప్ప మీదున్న ఏపీ మోడల్ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు వ్యాస రచన, వక్తృత్వ పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు తెలిపారు. వంశీ, సంధ్య అనే విద్యార్థులను సోమవారం ఉపాధ్యాయులతో పాటు ఎంఈఓ శ్రీలక్ష్మి అభినందించారు. ఈ నెల 28న నంద్యాల మున్సిపాల్ పాఠశాలలో ఖాదీమహోత్సవ్ అనే అంశంపై జిల్లా స్థాయిలో వ్యాస రచన,వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనపరచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ వివరించారు. నవంబర్ నెలలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణం ప్రారంభం

రుద్రవరం: మండలంలోని బి.నాగిరడ్డిపల్లె ఎస్సీ కాలనీలో రూ.4.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు సోమవారం చేపట్టారు. పేరూరుతో పాటు పంచాయతీ మజరా బి.నాగిరెడ్డిపల్లెలో ఇటీవల ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి ప్రజల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.ఇందులో భాగంగా బి.నాగిరెడ్డిపల్లె ఎస్సీ కాలనీ వాసులు సీసీ రోడ్డు వేయించాలని కోరారు. దీంతో గడప జీజీఎంపీ నిధుల నుంచి రూ.4.5 లక్షలు కేటాయించారు. దీంతో పీఆర్ ఏఈ వెంకటరాముడు ఎస్సీ కాలనీలో 95 మీటర్ల పొడవున నిర్మాణ పనులు చేపట్టారు.కాలనీ వాసులు ప్రభుత్వానికి,ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

పత్తిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

దొర్నిపాడు: పత్తి పంటలో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారి సునీత సూచించారు. వైఎస్సార్ పొలంబడి కార్యక్రమంలో భాగంగా సోమవారం దొర్నిపాడులోని పత్తి పంటలను పరిశీలించారు. వర్షాభావ పరిస్థితుల వల్ల పంట బెట్టపోతోందని, లీటర్ నీటికి 20గ్రాముల పొటాషియం నైట్రేట్, 20 గ్రాముల యూరియాను కలిపి పంటపై పిచికారీ చేయాలన్నారు.

స్థానిక హమాలీలకే ప్రాధాన్యత ఇవ్వాలి

నంద్యాల(న్యూటౌన్): స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ గిడ్డంగుల్లో నంద్యాల హమాలీలకే ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతూ స్పందనలో జాయింట్ కలెక్టర్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సీపీఐ ఎంఎల్ ఆర్ఐ జిల్లా కార్యదర్శి గాలి రవిరాజ్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఇంత వరకు కర్నూలు జిల్లా హమాలీను గిడ్డంగుల్లో నియమించారన్నారు. జిల్లా విడిపోయిన తర్వాత గిడ్డంగుల్లో కొత్తగా హమాలీలను తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించిందని, నూతన నియామకాల్లో నంద్యాల జిల్లాకు చెందిన హమాలీలకే ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

అంతర్జాతీయ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం సింధూర

చాగలమర్రి: ముత్యాలపాడు గ్రామంలోని బర్డ్స్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు సంజన శ్రీ, భార్గవిరెడ్డి, వైష్ణవి అంతర్జాతీయ స్థాయి జంప్‌రోప్ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల హెచ్ఎం సింధూర తెలిపారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసి అభినందన సభలో ఆమె మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు తెనాలిలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో సంజనశ్రీ, భార్గవిరెడ్డి బంగారు పతకం, వైష్ణవి వెండి పతకం సాధించడంతో అంతర్జాతీయ పోటీలకు ఎంపిక చేశారన్నారు. త్వరలో థాయిలాండ్ దేశంలోని బ్యాంకాక్‌లో జరిగే అంతర్జాతీయ పోటీల్లో దేశం తరఫున ప్రాతినిథ్యం వహిస్తారన్నారు. విద్యార్థులు, శిక్షకుడు రవిశంకర్‌ను బర్డ్స్ సంస్థల అధినేత పాల్ రాజారావు, హెచ్ఎం ,ఇంచార్జ్ బార్నబాస్, కో-ఆర్డినేటర్ భాస్కర్ అభినందించారు.

వాగులో పడి వృద్ధుడి మృతి

రుద్రవరం: చిలుకలూరు గ్రామానికి చెందిన చాకలి రాముడు(65) ప్రమాదవశాత్తు వక్కిలేరు వాగులో పడి మృతి చెందాడు. అయితే మృతి పట్ల గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. ఉదయాన్నే పశువులను మేపేం దుకు వక్కిలేరు వాగు వైపు వెళ్లాడు. సాయంత్రం అయినా ఇంటికి రాక పోవడంతో కుటుంబ సభ్యులు వెతికేందుకు వెళ్లి వక్కిలేరు వాగు నీటి గుంతలో మృతదేహాన్ని గుర్తించారు. అయితే ఆయన మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎస్ఐ శరత్‌కుమార్ రెడ్డిని అడుగగా.. తమకు ఫిర్యాదు అందిందని కేసు నమోదు చేసి విచారణ చేస్తామని తెలిపారు.

దరఖాస్తు చేసుకోండి

నంద్యాల(వ్యవసాయం): పేద ముస్లిం యువతుల వివాహాలకు అంజుమాన్ సంస్థ రూ. 50 వేల ఆర్థిక సాయం అందజేస్తుందని, ఇందుకు నిరుపేదల దరఖాస్తు చేసుకోవాలని సంస్థ అధ్యక్షుడు నశ్యం అబ్దుల్ ఖుద్దూస్ తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నవంబరు 27వ తేదీ నాటికి వధూవరుల ఫొటోలు, ఆధార్‌కార్డులతో కూడిన దరఖాస్తులను నంద్యాల బస్టాండ్ వద్దను అంజుమాన్ షాదీఖానాలో అందజేయాలని సూచించారు. వధువు నంద్యాలకు చెంది 18 సంవత్సరాల వయస్సు నిండి ఉండాలన్నారు. అర్హులైన వారికి డిసెంబర్ 3న అంజుమాన్ షాదిఖానాలో సామూహిక వివాహాలు నిర్వహించి రూ. 50 వేల చెక్కును వధూవరులకు అందజేస్తామని చెప్పారు.

సురక్షతో ఇంటి చెంతకే వైద్యం

నంద్యాల టౌన్ : వైద్యం కోసం ఆస్పత్రులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇంటి వద్దకే డాక్టర్లు వచ్చి వైద్యసేవలు అందిస్తున్నారని ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, మున్సిపల్ చైర్పర్సన్ మాబున్నీసా తెలిపారు. సోమవారం పట్టణంలోని జగజ్జనీ నగర్‌లోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో వారు పాల్గొన్నారు. వైద్య శిబిరంలో 612 మందికి వైద్యం అందించామని 24 మందికి మెరుగైన చికిత్స నిమిత్తం ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రికి రెఫర్ చేశామని వైద్య అధికారి ప్రియ భావన తెలిపారు. హరిజన వాడ పట్టణ ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన వైద్య శిబిరంలో 512 మందికి వైద్యం అందించామని, ఏడుగురిని మెరుగైన చికిత్స కోసం ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్ కు రెఫర్ చేశామని వైద్యాధికారి సభ బేగం పేర్కొన్నారు.

ముగిసిన సురక్ష వైద్య శిబిరాలు

శిరివెళ్ల: మండలంలో జగనన్న ఆరోగ్య సరక్ష వైద్య శిబిరాలు సోమవారం ముగిశాయి. గత నెల 30 తేదీ నుంచి మొదలైన శిబిరాల్లో 8,765 మందికి వైద్య పరీక్షలు చేశారు. 56 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు మెరుగైన వైద్యం కోసం రెఫర్ చేశారు. కాగా చివరి రోజు గోవిందపల్లెలో జరిగిన శిబిరంలో 551 మందికి స్పెషలిష్టు వైద్యులు వైద్య పరీక్షలు చేసి 19 మందిని ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు రెఫర్ చేశారు. కార్యక్రమంలో సర్పంచు మరియమ్మ, గ్రామ పెద్ద ఇందూరి ప్రతాపరెడ్డి, ఉప సర్పంచు ఇందూరి శేషారెడ్డి, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, ఈఓఆర్డీ నాగేంద్ర, మండల ప్రభుత్వ వైద్యాధికారి విజయకుమార్, సీహెచ్ఓ రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

రుద్రవరం: మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సోమవారం ముగిసింది. మండంలో మొత్తం 14 గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కింద వైద్య శిబిరాలు నిర్వహించి వేలాది మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా అందజేశారు.ఇందులో భాగంగానే చివరి రోజున ఎల్లావత్తుల గ్రామంలో ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, వైద్యులు శ్రావణి, అమరనాథరెడ్డి,పంచాయతీ కార్యదర్శులు పాములేటి,కళావతి,షాహినూర్, సర్పంచు చంద్రమోహన్ శిబిరాన్ని ప్రారంభించారు. సచివాలయం పరిధిలోని 753 మంది వైద్య పరీక్షలు చేయించుకోగా వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శిబిరంలో మహిళలకు పోషకాహారంపై అవగాహన కల్పించడంతో పాటు పలువురికి సీమంతాలు చేసి ఆశీర్వదించారు.



నంద్యాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లును అందజేస్తున్న ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా



గోవిందపల్లెలో మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం



ఎల్లావత్తుల శిబిరంలో గర్భిణులకు సీమంతం చేస్తున్న దృశ్యం

క్రీడల్లో ఉత్తమ ప్రతిభ చూపాలి



విజేతలకు షీల్డ్ అందజేసిన ఎమ్మెల్సీ ఇసాక్ బాషా

నంద్యాల(న్యూటౌన్): క్రీడాకారులు జాతీయ, రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి నంద్యాల జిల్లాకు మంచి పేరు తీసుకొని రావాలని నంద్యాల ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా ఆకాంక్షించారు. సోమవారం పట్టణంలోని గురురాజ ఇంగ్లిష్ మీడియం స్కూల్ ప్రాంగణంలో మూడు రోజులుగా జరుగుతున్న ఏడవ జిల్లా స్థాయి త్రోబాల్ క్రీడ విజేతలకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, చైర్మన్ దస్తగిరిరెడ్డి, రామకృష్ణారెడ్డి, ఐఎంఏ అధ్యక్షుడు రవికృష్ణ, చిన్నపురెడ్డి హాజరయ్యారు. దస్తగిరిరెడ్డి మాట్లాడుతూ పోటీలకు ఉమ్మడి జిల్లాల నుంచి 108 టీములు తలపడ్డాయన్నారు. పోటీల్లో విజ్ఞాన పీఠం కర్నూలు బాలుర జట్టు ప్రథమ స్థానం, గురురాజ ఇంగ్లిష్ మీడియం ద్వితీయ స్థానం, గుడ్‌షెప్పర్డ్ స్కూల్, భాగ్యనగరం జిల్లా పరిషత్ హైస్కూల్ తృతీయ స్థానాల్లో నిలిచాయి. జిల్లా క్రీడా ప్రతినిధులు ఏపీరెడ్డి, మోహన్‌రెడ్డి, నాగరాజు, దివాకర్, శ్రీధర్, విష్ణు, బాలకృష్ణ పాల్గొన్నారు.

పారదర్శక పాలనకు ఆద్యుడు జగనన్న



చింతలచెరువులో మహిళకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల

చాగలమర్రి: అర్హులందరికీ సంక్షేమ పథకాల సొమ్మును నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలకు జమచేసి పారదర్శక పాలనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శంగా నిలిచారని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. పథకాలను ప్రజల ముంగిటకు చేర్చేందుకు గ్రామ, వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసి ప్రజలకు అవసరమైన సేవలను అందించేలా చర్యలు చేపట్టారని కొనియాడారు. సోమవారం మండలంలోని చింతల చెరువు గ్రామంలో ఎంపీటీసీ రాజేశ్వరి, పార్టీ మండల అధ్యక్షుడు కుమార్‌రెడ్డితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వీరభద్రుడు, నాయకులు లక్ష్మీరెడ్డి, బీవీ. సుబ్రహ్మణ్యం, వేంకటేశ్వర రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సాగునీటి సంఘం అధ్యక్షుడు శేషు రమేష్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు జి.గణేష్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు పత్తి నారాయణ, కె.లక్ష్మీరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రామగుర్విరెడ్డి, ఏఈలు కొండారెడ్డి, షాజహాన్, షఫీవుల్లా, పంచాయతీ కార్యదర్శి స్వప్న, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీలమ్మ పాల్గొన్నారు.

సీ ఫుడ్ ఫెస్టివల్‌ను విజయవంతం చేయండి

ఆళ్లగడ్డ: అధిక ప్రోటీన్, మినరల్స్, విటమిన్స్ ఇచ్చే చేపలు, రొయ్యల ఫుడ్ ఫెస్టివల్‌ను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో నవంబర్ 3 నుంచి 5వ తేదీ వరకు కర్నూలు పట్టణంలోని రావూరి గార్డెన్‌లో భూమి ఆర్గానిక్స్, మత్స్యశాఖలు సంయుక్తంగా నిర్వహించనున్న మెగా సీ ఫుడ్ (రొయ్యలు, చేపల) ఫెస్టివల్ కు సంబంధించిన బ్రోచర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. మత్స్యశాఖ ఏడీ సంధ్యారాణి, మత్స్య అభివృద్ధి అధికారి పామన్న ఫిషరీస్ అసిస్టెంట్లు నరసింహ, శిరోమణి ఉన్నారు.



సీ ఫుడ్ ఫెస్టివల్ బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

మిషన్ పింక్ హెల్త్ విభాగం ఎన్నిక

నంద్యాలటౌన్: ఐఎంఏ నంద్యాల మిషన్ పింక్ హెల్త్ విభాగం నూతన అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకున్నట్లు ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు రవికృష్ణ తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షురాలిగా డాక్టర్ నెరవాటి అరుణకుమారి, గౌరవాధ్యక్షురాలిగా డాక్టర్ నాగమణి, కార్యదర్శులుగా డాక్టర్లు శైలజ, సుసుమా, కోశాధికారిగా డాక్టర్ రాధిక, ఉపాధ్యక్షులుగా నాగరేఖ, చంద్రకళ, సంయుక్త కార్యదర్శులుగా డాక్టర్లు అరిఫాబాను, అనిత, కార్యవర్గ సభ్యులుగా డాక్టర్లు లక్ష్మీప్రసన్న, జ్యోతి, భారతి, కిరణ్మయి, స్ఫూర్తి, తనూజ, సింధు, అనూష, హారిక, జాస్మిన్ సుల్తానా, అనూష, ఆశాలత, శ్రీవాణి, దివ్యతేజ, మధుప్రీతి ఎన్నికయ్యారని చెప్పారు.

మహిళల అభ్యున్నతే లక్ష్యం

నంద్యాల: మహిళల అభ్యున్నతే శిల్పా మహిళా సహకార్ బ్యాంక్ లక్ష్యమని బ్యాంక్ చైర్‌పర్సన్ నాగినిరెడ్డి తెలిపారు. స్థానిక టెక్కె మార్కెట్‌యార్డులో సోమవారం 107 మంది మహిళలకు రూ.13.65 లక్షల చెక్కులను అందజేశారు. అలాగే శిల్పా స్కిల్ డవలప్‌మెంట్ శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందిన 60మంది మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు.

ఘర్షణ..కేసు నమోదు

దొర్నిపాడు: మండలకేంద్రంలో ఇరువర్గాలు స్థలం విషయంలో ఘర్షణ పడటంతో కేసులు నమోదు చేశామని ఎస్ఐ తిరుపాల్ సోమవారం తెలిపారు. దూదేకుల దస్తగిరి, ఉసేన్‌బీ కుటుంబాల మధ్య ఘర్షణ చోటుచేసుకోగా ఇరు వర్గాలు కర్రలతో దాడులు చేసుకున్నారు. రెండు వర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

గడప గడపకు సంక్షేమ ఫలాలు

నంద్యాల(సిటీ): గడప గడపకు సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం 13వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, కౌన్సిలర్‌లు కాల్వ సరస్వతి, నాగరాజుతో కలిసి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వార్డు అభివృద్ధిలో గత ప్రభుత్వానికి మన ప్రభుత్వానికి తేడా గమనించాలని స్థానికులను కోరారు. ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న పథకాలు, పొందిన లబ్ధిని వివరించే బుక్‌లెట్‌లను అందజేశారు. వార్డులో ఏ సమస్యలు ఉన్నా సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పేదలందరికీ మంచి చేస్తున్న పేదల ప్రభుత్వాన్ని మరోమారు ఆశీర్వదించాలని కోరారు. మంచి చేస్తున్నందుకే ప్రతి గడపకు గర్వంగా వెళ్లగలుగుతున్నమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిసా, రాష్ట్ర బెస్త సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్, రాష్ట్ర దృశ్యకళల డైరెక్టర్ సునీత అమృతరాజ్, నంద్యాల పట్టణ అధ్యక్షుడు పడకండ్ల సుబ్రహ్మణ్యం, జాకీర్ హుసేన్, నాయకులు టైలర్ శివ, మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, ఎస్ఎస్ ఖాద్రి, గురునాథ్, శిరిగిరి రమేష్, అడ్వకేట్ మాధవరెడ్డి, సత్యనారాయణ, దేవక్క, ఆర్వీ సుబ్బారెడ్డి, శంకర్ నాయక్, గెలివి రామకృష్ణ, మనోహర్ రెడ్డి, కృష్ణారెడ్డి, అల్లాబకాష్ పాల్గొన్నారు.



మహిళకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా

సామాజిక సాధికార యాత్రను విజయవంతం చేద్దాం

రుద్రవరం: నవంబర్ 7వ తేదీన ఆళ్లగడ్డలో నిర్వహించే సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేద్దామని ఏపీ జలవనరుల శాఖ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ మండపంలో సోమవారం మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు,ఎంపీటీసీలు,నాయకులు,కన్వీనర్లలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ముఖ్యమంత్రి చేయలేని విధంగా సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారని, అన్ని సామాజిక వర్గాలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందజేసి వారి అభివృద్ధికి అండగా నిలుస్తున్నారని కొనియాడారు. తిరిగి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం సామాజిక సాధికార బస్సు యాత్ర చేపట్టారని నంద్యాల జిల్లాలో ఆళ్లగడ్డలో మాత్రమే యాత్ర ఉందని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్‌యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి,ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణ, పార్టీ మండల కన్వీనర్ పాణ్యం నాగేష్, పార్టీ మండల అధ్యక్షుడు ప్రసాదరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గంగుల ప్రభాకర్‌రెడ్డి

పౌర హక్కులను పరిరక్షించాలి

ఉయ్యాలవాడ: పౌరుల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు కొమ్ముపాలెం శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని తుడుమలదిన్నె గ్రామంలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఎస్ఐ సత్యనారాయణ, ఆర్ఐ తులసీకృష్ణ, మండల విస్తరణ అధికారి వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

సాగునీటి హక్కులపై అవగాహన అవసరం


నంద్యాల(సెంట్రల్): సాగునీటి హక్కులపై సమగ్ర అవగాహనతోనే సీమ రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలకు పరిష్కారం లభిస్తుందని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథ రామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని సమితి కార్యాలయంలో 'నీటి అవగాహనే రాయలసీమకు రక్ష' పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాయలసీమకు సంబంధించిన సాగునీటి ప్రాజెక్టులు, నిర్వహణ విధానాలపై సామాన్యుడికి సైతం అర్థమయ్యేలా పుస్తకాన్ని రూపొందించామన్నారు. కేంద్ర ప్రభుత్వం కృష్ణా జలాల పునఃపంపిణీపై అక్టోబర్ 6న విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌తో సీమకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. పుస్తకంలోని అంశాల్ని గత మూడు వారాలుగా సామాజిక మాధ్యమాల ద్వారా విడుదల చేశామని, ప్రతి ఒక్కరూ ఈ అంశాల్ని తెలుసుకుని చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు. సమితి ఉపాధ్యక్షుడు వై.ఎన్.రెడ్డి, ఏరువ రామచంద్రారెడ్డి, సొదాసాగర్ ఖాసీం మియా, రామకృష్ణారెడ్డి, కొమ్మా శ్రీహరి, ఏరువ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పుస్తకావిష్కరణ చేస్తున్న బొజ్జా దశరథ రామిరెడ్డి

కుళ్లిన గుడ్లు

ఉయ్యాలవాడ : స్థానిక మోడల్‌స్కూల్‌లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో అందించవలసిన కోడి గుడ్లు కుళ్లిపోవడంతో సోమవారం వాటిని పక్కన పడవేశారు. బనగానపల్లెకు చెందిన ఏజెన్సీ నిర్వాహకులు పాఠశాలకు సరఫరా చేయవలసిన కోడి గుడ్లు నిర్ణీత సమయంలో అందించలేదు. దీంతో పక్కనేనున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 200 కోడి గుడ్లు వంట నిర్వాహకులు తీసకొచ్చారు. ఆ గుడ్లను నీటిలో వేయగా 50 గుడ్లు పైకి తేలాయి. మిగతా 150 గుడ్లను ఉడికించగా వాటిని బయటకు తీసి శుభ్రపరుస్తుండగా దుర్వాసన వెదజల్లుతుండడంతో వాటిని కూడా విద్యార్థులకు అందించకుండా బయట పడేరు. ప్రత్యామ్నాయంగా టమోటా కర్రీ ఏర్పాటు చేసి 235 మంది విద్యార్థులకు భోజన సదుపాయం కల్పించారు. ఈ విషయమై ఎంఈఓ వీరప్రతాప్‌రెడ్డిని వివరణ కోరగా..ఏజెన్సీ నిర్వాహకులు సకాలంలో పాఠశాలలకు గుడ్లు చేరవేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న విషయం వాస్తవమే. పాఠశాలల్లో నిల్వ ఉన్న గుడ్లను పరిశీలన చేసి జిల్లా విద్యాశాఖాధికారులకు ఏజెన్సీ నిర్వాహకుల నిర్లక్ష్య వైఖరిపై ఫిర్యాదు చేస్తామని ఎంఈఓ తెలిపారు.



ఉయ్యాలవాడ మోడల్‌స్కూల్‌లో గుడ్లు కుళ్లిపోవడంతో పడేసిన దృశ్యం

సంప్రదాయాలను ఆచరించాలి

గోస్పాడు: ప్రతి ఒక్కరూ హిందూ సంప్రదాయలు, సంస్కృతులను ఆచరించాలని రాయలసీమ జోనల్ ధర్మ ప్రచారక్ ఈశ్వరరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నైతిక విలువలను పాటించాలని కోరారు. సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

రెడ్డి సంఘం రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలిగా సుహాసిని



నంద్యాల(అర్బన్): ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలిగా నంద్యాల పట్టణానికి చెందిన సానం రెడ్డి సుహాసిని ఎంపికయ్యారు. ఈ మేరకు సోమవారం తిరుపతిలోని రెడ్డి భవన్‌లో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు నరేష్‌కుమార్‌రెడ్డి సుహాసిని రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలిగా నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం సుహాసిని మాట్లాడుతూ సంఘం రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తూ రెడ్లకు, ప్రభుత్వానికి వారధిలా పని చేస్తుందన్నారు.

నేడు అవుకు పర్యాటక నిర్మాణాల వేలం

నంద్యాల (సెంట్రల్): అవుకు మండలం చెర్లోపల్లె వద్దనున్న పర్యాటకశాఖ వసతి గృహం, రెస్టారెంట్, బోటింగ్ సౌకర్యాలను నిర్వహించుకునేందుకు మంగళవారం బహిరంగ వేలం నిర్వహిస్తామని జిల్లా పర్యాటక శాఖ అధికారి సీహెచ్ సత్యనారాయణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ భవన సముదాయం మొదటి అంతస్తులోని జిల్లా పర్యాటక శాఖ కార్యాలయంలో ఉదయం 9.30కు వేలం ఉంటుందని, ఆసక్తి గల వారు రూ.10 వేల ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు. వేలం దక్కించుకున్న వారు సెక్యూరిటీ డిపాజిట్ రూ.50 వేలు, ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ రూ.50 వేలు వెంటనే చెల్లించాలన్నారు.

ఇళ్లు కట్టించి ఇవ్వాలి

నంద్యాల(అర్బన్): గిరిజనులకు పక్కా ఇళ్లు ప్రభుత్వమే కట్టించి ఇవ్వాలని గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్ కోరారు. గిరిజనులకు హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా మంజూరైన ఇళ్లను నిర్మించుకొనే స్థోమత లేదని, ప్రభుత్వం కట్టించి ఇచ్చేలా చర్యలు చేపట్టలంటూ సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌కు జీపీఎస్ నాయకులు వినతి పత్రం అందజేశారు.

సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ సాంఘిక సంక్షేమ హాస్టళ్ల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నంద్యాల పట్టణంలోని పద్మావతి సర్కిల్ వద్ద భిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రఫీ, ప్రధాన కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులకు సరైన వసతులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కాస్మోటిక్, మెస్ చార్జీలు పెంచాలని కోరారు. ఖాళీగా ఉన్న వార్డెన్, వాచ్‌మెన్, కమాటీ, వంట మనిషి పోస్టులను భర్తీ చేయాలన్నారు. నాయకులు బాలాజీ, రవి, వంశీ, వినయ్, మనోహర్, హరి, నవీన్, రవీంద్ర, బాలు, రమణ, విజయ్ పాల్గొన్నారు.

టెంకాయల విక్రయానికి వేలం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని ప్రథమనంది ఆలయ ఆవరణలో టెంకాయలు అమ్మకాల హక్కుకు సోమవారం వేలం నిర్వహించినట్లు ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. వేలంలో రాఘవేంద్ర అనే వ్యక్తి రూ. 58 వేలకు దక్కించుకున్నారన్నారు. గత ఏడాది కంటే రూ.10 వేల ఆదాయం సమకూరిందని చెప్పారు. పర్యవేక్షణ అధికారి శశికుమార్ పాల్గొన్నారు.

సార్.. మా భూమి ఇప్పించండి

ఉయ్యాలవాడ: సార్ మా భూమిని మరో రైతు స్వాధీనం చేసుకుని సాగు చేసుకుంటున్నాడు, మా భూమి మాకు చెందేలా న్యాయం చేయాలంటూ ఆర్.జంబులదిన్నె రైతులు తహసీల్దార్ రవికుమార్‌ను అభ్యర్థించారు. మండల కేంద్రంలో జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమం రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. గ్రామానికి చెందిన రైతులు కొంగన సుబ్బరాయుడు, వెంకటరమణ సర్వే నంబర్ 64లో 11.03 ఎకరాలు ఉండగా ఇదే సర్వే నంబర్‌లోని భూమి 8.23 ఎకరాలు మా గ్రామంలో వున్న రిటైర్డ్ వీఆర్ఓ శివరంగారెడ్డి రెవెన్యూ కార్యాలయంలో రికార్డులు మార్పు చేసి గ్రామానికి చెందిన గోవిందరెడ్డి అనే రైతుకు 2020 అక్టోబర్‌లో విక్రయించి ఆన్‌లైన్‌లో నమోదు చేయించారని బాధిత రైతులు ఆరోపించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు. నర్సిపల్లె గ్రామానికి చెందిన కంబయ్య అనే రైతు తన భూమికి సంబంధించి 1బీ అందజేయాలని కోరగా అరగంట వ్యవధిలోనే 1బీని అందజేయడంతో సంతృప్తి చెందాడు.



బాధిత రైతు అందజేసిన పత్రాలను పరిశీలిస్తున్న తహసీల్దార్

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

దొర్నిపాడు: గృహ నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ సుబ్బారెడ్డి, హౌసింగ్ డీఈ కోటేశ్వరరావు సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ 9 సచివాలయాల పరిధిలో 595 గృహాలు మంజూరు కాగా 292 నిర్మాణాలు పూర్తయినట్లు చెప్పారు. మిగిలిన గృహాలు వివిధ దశల్లో ఉన్నాయని వెంటనే లబ్ధిదారులకు అవగాహన కల్పించి పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. బిల్లులు పెండింగ్ లేకుండా దశలవారీగా ప్రభుత్వం లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తుందన్నారు. ఏఈలు బ్రహ్మయ్య, నాగరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ , హౌసింగ్ డీఈలు

జిల్లా ఆసుపత్రిలో మందులు ఇవ్వడం లేదు

నంద్యాల(న్యూటౌన్): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో రోగులకు మందులు ఇవ్వడం లేదని, బయటకు రాస్తున్నారని, డాక్టర్లపై విచారణ చేపట్టాలని సోమవారం స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌కు అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా కార్యదర్శి నాగరాముడు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రికి వైద్యం కోసం పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి పేద ప్రజలు ఎక్కువగా వస్తుంటారని, డాక్టర్లు మందులను బయటకు రాయడం సమంజసం కాదన్నారు. అలాగే ఆసుపత్రిలో డ్రగ్స్ మాఫియాపై విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. న్యూరో, హార్ట్‌కు సంబంధించిన డాక్టర్లు ఆసుపత్రిలో లేకపోవడం బాధాకరమన్నారు.

సర్వేయర్‌పై చర్యలు తీసుకోవాలి..

డోన్ మండల రెవెన్యూ సర్వేయర్ అవినీతి అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, ప్రసాద్, సోమన్న స్పందనలో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ డోన్ మండలంలో జగనన్న శాశ్వత భూ హక్కు-భూ రక్ష పథకం ద్వారా రైతుల భూముల్లో రీసర్వే జరుగుతున్న భూముల్లో మండల సర్వేయర్ అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

చాగలమర్రి: స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పాఠశాల క్రీడల్లో సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం కోటయ్య తెలిపారు. సోమవారం పాఠశాలలో నిర్వహించిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ అండర్-17 బాలుర విభాగంలో సాయిచరణ్, కార్తీక్, బాలికల విభాగంలో నవ్యశ్రీ, హరిత, అండర్-14 విభాగంలో బాలురు మహబూబ్ షరీఫ్, బాలికల విభాగంలో లక్ష్మీకల్యాణి, మనీషా ఎంపికయ్యారన్నారు. ఈ నెల 11న కర్నూల్ జిల్లాలో జరిగిన ఎంపిక పోటీల్లో ప్రతిభ చూపారని చెప్పారు. నవంబర్ 4న ఒంగోలులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో అండర్-17 క్రీడాకారులు, గుంటూరులో జరిగే పోటీల్లో అండర్-14 క్రీడాకారులు జిల్లా జట్టుకు ప్రాతినిథ్యం వహిస్తారని వివరించారు.

కాశీకి పార్థివ లింగాలు

నంద్యాల(వ్యవసాయం): కాశీ క్షేత్రంలో కార్తీక మాసంలో నిర్వహించే శివసంకల్పమస్తు అనే కార్యక్రమానికి పార్థివ లింగాలను పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీ రామాలయం నుంచి పంపుతున్నామని బాలాజీ సేవా సమితి అధ్యక్షులు ధనుంజయరెడ్డి, వెంకటేశ్వర్లు, సంధ్యారెడ్డి తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ 25వేలకు పైగా చిన్న శివలింగాలను వచ్చే నెల 2వ తేదీలోగా పంపుతామని చెప్పారు. హైదరాబాద్‌కు చెందిన శ్రీ విజయనంద గురువు సేవా సమితి సభ్యులు కాశీ క్షేత్రంలో నవంబర్ 19 - 27వ తేదీ వరకు ఈ లింగాలకు అభిషేకాలు చేస్తారన్నారు.